సాక్షి సిద్దిపేట

ఆదివారం । 24 । మార్చి । 2024



రూ.63.76 లక్షలు సీజ్

జిల్లాలోని సరిహద్దుల్లో వాహనాల తనిఖీ ముమ్మరంగా కొనసాగుతోంది. శనివారం ఒక్క రోజే 63.76 లక్షలను అధికారులు సీజ్ చేశారు. వివరాలు 8లో ▸



అవార్డులు స్ఫూర్తిని నింపుతాయి

అవార్డులు స్ఫూర్తిని నింపుతాయని, అంకిత భావంతో సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
ఆదివారం (సాయంత్రం) 06:33	సోమవారం (ఉదయం) 04:54



అలయాలకు ఏర్పాటు చేసే రాతి చొకోట్లు

రాళ్ల గుట్టలే ఉపాధి మార్గాలు

రాంపూర్ గ్రామానికి చెందిన 10 కుటుంబాలకు చెందిన శిల్పులు రాళ్ల గుట్టలను ఉపాధిగా మలుచుకున్నారు. పెద్ద పెద్ద రాళ్లు తొలిచి ధ్వజస్తంభాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఏడాదికి 10 నుంచి 15 ధ్వజస్తంభాలను తయారు చేస్తున్నారు. గ్రామం చుట్టూ కిలోమీటర్ పొడవునా రాళ్ల గుట్టలు ఉన్నాయి. 10 నుంచి 50 ఫీట్ల వరకు ధ్వజ స్తంభాలను తయారు చేసి విక్రయిస్తారు. ధ్వజస్తంభం కావాలంటే ఆరు నెలల ముందుగానే వీరికి చెప్పాల్సి ఉంటుంది. ఒక్కోటి చెక్కడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుంది. ఎన్ని ఫీట్లు అవసరమో చెబితే గుట్టలో ఉన్న రాళ్లను వెతికి పట్టుకుంటారు. ధ్వజస్తంభాలతో సోమశిల, బలిపీఠం, చొకోట్లు, గుడి పైకప్పులు, శిల్పాలు, విగ్రహాలను తయారు చేస్తారు.

ధ్వజ ధీరులు

సండే స్పెషల్

ధ్వజస్తంభం హిందూ దేవాలయాల్లో ఒక భాగం. దాని చుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాతే దైవదర్శనం చేసుకోవడం ఆచారం. అయితే ఈ ధ్వజస్తంభాల తయారీలో అల్లాదుర్గం మండలం రాంపూర్ శిల్పులు సిద్ధహస్తులు. జీవం లేని బండరాళ్లను అందమైన కళాకృతులుగా మలుస్తున్నారు. గుట్టల్లో ఉన్న రాళ్లను తొలిచి చూడ ముచ్చటగా తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సజీవరూపం ఉట్టిపడేలా చెక్కుతూ గుర్తింపు పొందారు. జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తూ పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

- మజ్జిగ వీరేందర్
- అల్లాదుర్గం (మెదక్)



ధ్వజస్తంభాల తయారీలో సిద్ధహస్తులు

- రాయిని తొలచి.. సజీవరూపంలా మలిచి..
- రాంపూర్ శిల్పుల అద్భుత నైపుణ్యం
- జీవనాధారం అవుతున్న వృత్తి
- జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో విక్రయాలు

శిల్ప కళే వృత్తి



దశాబ్దాలుగా ధ్వజ స్తంభాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. తయారీలో 10 మంది వరకు పాలు పంచుకుంటాం. ధ్వజ స్తంభంపై శిల్పాలు చెక్కి అందంగా తీర్చిదిద్దుతాం. అలాగే ఆలయాల నిర్మాణానికి కావాల్సిన రాళ్ల సామగ్రిని తయారు చేస్తాం. గతంలో వీటి తయారీ కోసం ఎంతో కష్టపడేవారం. ప్రస్తుతం యంత్రాలు రావడంతో కొంత ఇబ్బంది తగ్గింది. ధ్వజ స్తంభాలు తయారు చేయడంతో వచ్చే ఆదాయంతోనే కుటుంబాలను పోషించుకుంటున్నాం.

– సైదా,
శిల్ప కళాకారుడు, రాంపూర్

నిష్ఠతో ఉంటాం



దేవాలయాల్లో ధ్వజ స్తంభాలకు ఎంతో మహిమ ఉంటుంది. వీటిని తయారు చేసేటప్పుడు నియమ, నిష్ఠతో ఉంటాం. ఆచారాలు పాటిస్తాం. మద్యం, మాంసాహారం అస్సలు ముట్టుకోం. ధ్వజస్తంభం పూర్తయ్యే వరకు నిష్ఠగా వ్యవహరిస్తాం.

– సాయిలు,
శిల్ప కళాకారుడు, రాంపూర్

ఆనందంగా ఉంది



ఆలయాల్లో మేము తయారు చేసిన ధ్వజ స్తంభాలను వేలాది మంది భక్తులు కొలుస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన ధ్వజ స్తంభాల పట్ల మనతో పాటు పక్క రాష్ట్రాల భక్తులకు విశ్వాసం ఉండడం ఆనందంగా ఉంది. వృత్తిని అంకితభావంతో నిర్వహిస్తున్నాం.

– అనిల్,
శిల్ప కళాకారుడు, రాంపూర్



ధ్వజ స్తంభాలను చెక్కుతున్న శిల్పులు

రాంపూర్‌లో తయారు చేసిన ధ్వజ స్తంభాలను ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లోని ఆలయాలకు విక్రయించినట్లు కార్మికులు చెబుతున్నారు. 50 ఫీట్ల ధ్వజస్తంభం రూ. 2 లక్షల 50 వేల వరకు విక్రయిస్తామంటున్నారు. ధ్వజస్తంభాల ఆర్డర్లు తక్కువగా వస్తాయని.. పెద్ద పెద్ద దేవాలయాల్లోనే వీటిని ప్రతిష్ఠిస్తారని చెబుతున్నారు. ఆర్డర్లు ఇచ్చిన తర్వాత రాళ్లను వెతకడంతో పాటు తయారు చేయడానికి నిష్ఠతో మూడు, నాలుగు నెలలు పని చేస్తామన్నారు. పెద్ద పెద్ద రాళ్లను అటవీ ప్రాంతం నుంచి క్రేన్ సహాయంతో తయారు చేసే ప్రాంతానికి తరలిస్తామన్నారు. క్రేన్లు, యంత్రాలు వాడటం, నెలల తరబడి పడిన కష్టానికి తగిన ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టానికి తగిన ఆదాయం లేదు

ప్రభుత్వం ఆదుకోవాలి

వందల ఏళ్లుగా రాళ్లనే నమ్ముకొని శిల్పాలను చెక్కి జీవనం సాగిస్తున్నాం. ఎంతో పవిత్రతతో ధ్వజ స్తంభాలు తయారు చేసినా సరైన ఆదాయం రాక కూలీలుగానే బతుకుతున్నామని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శిల్ప కళాకారులకు సరైన ఉపాధి దొరకడం లేదని వాపోతున్నారు. శిల్ప కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెద్ద పెద్ద రాళ్లు ఉన్న గుట్టలను అసైన్డ్ భూమి కింద పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని వేడుకుంటున్నారు.

న్యూస్‌రీల్

గణిత పరీక్షకు 99.93 శాతం హాజరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం గణితం పరీక్షను విద్యార్థులు రాశారు. 13,989 మందికి గాను 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరు 99.93 శాతంగా నమోదు అయ్యింది. అబ్జర్వర్ సోమిరెడ్డి రాజగోపాల్‌పేట, నంగునూరు, అక్కెనపల్లి, హుస్నాబాద్‌లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అలాగే జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శనిగరం, బెజ్జంకి, కోహెడలలోని కేంద్రాలను పరిశీలించారు. జిల్లా పరీక్షల సహాయ అధికారి లక్ష్మయ్య రంగధాంపల్లి, సిద్దిపేట, మిట్టపల్లి కేంద్రాలను పరిశీలించారు.

పరిహారం ఇప్పించరూ..

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన భూ నిర్వాసితుల పెళ్లయిన యువతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని వివాహితలు కోరారు. హుస్నాబాద్‌లోని తన కార్యాలయంలో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వారు విన్నవించారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ పెళ్లయిన వారితో పాటు తదితర పెండింగ్ సమస్యలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల తర్వాత పరిహారం చెల్లించేలా కృషి చేస్తానన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో, పరిహారం తదితర సమస్యల పరిష్కారం కోసం భూ నిర్వాసితులు కొంత ఓపిక పట్టాలని సూచించారు. కార్యక్రమంలో ముంపు గుడాటిపల్లి మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, నాయకులు నల్లా మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు, సిబ్బందికి రూ. 19 వేల జరిమానా

వర్గల్(గజ్వేల్): ఉపాధి హామీ పథకం పనుల రికార్డుల నిర్వహణ లోపాలకు గాను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది రూ. 19,000 ఫైన్ చెల్లించాలని అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ ఆదేశించారు. మండలంలో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై ఆయన స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో సామాజిక తనిఖీ ఇన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో గ్రామపంచాయతీల వారీగా చేపట్టిన పనులు, రికార్డులు, సోషల్ ఆడిట్ అంశాలను వేదికలో రిసోర్స్‌పర్సన్లు నివేదించారు. ఆయా అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు.

కారు.. కార్యాచరణ

మెదక్ స్థానంపై గులాబీ పార్టీ ఫోకస్

- రేపటి నుంచి అసెంబ్లీ స్థాయి ముఖ్యనేతలతో సమావేశాలు
- రెండు చోట్ల కేసీఆర్ బహిరంగ సభలు
- కార్యాచరణ ప్రారంభించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- ప్రత్యేక దృష్టి సారించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన కారు పార్టీ నియోజకవర్గంలో తన కార్యాచరణను ప్రారంభించింది. విజయావకాశాలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఒకటైన ఈ స్థానంపై ఆ పార్టీ అధినాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముందుగా గులాబీ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే పనిలో పడింది. ఇందుకోసం ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో ముఖ్యనేతలతో సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. హోలీ మరునాడు మంగళవారం నుంచి నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశాలు పూర్తయిన అనంతరం మండల స్థాయిల్లో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. క్షేత్ర స్థాయి కార్యకర్తను కలిసేలా ఈ సమావేశాలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ప్రతీ మండలంలో కనీసం ఒక పెద్ద గ్రామానికి అభ్యర్థి స్వయంగా వెళ్లి ప్రచారం నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. మున్సిపాలిటీలు, పెద్ద మండల కేంద్రాలన్నింటిలో రోడ్‌షోలు నిర్వహించాలని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా అభ్యర్థి స్వయంగా ఇంటింటి ప్రచారం నిర్వహించడం లోక్‌సభ ఎన్నికల్లో సాధ్యం కాదు. లోక్‌సభ నియోజకవర్గం పరిధి ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వీలైనంత ఎక్కువగా ఓటర్లతో మమేకమయ్యేలా కార్యాచరణకు రూపకల్పన చేస్తున్నారు.

50 రోజులు.. 41 మండలాలు..

పోలింగ్‌కు సుమారు 50 రోజులు మాత్రమే సమయం ఉంది. నియోజకవర్గంలో మొత్తం 41 మండలాలు ఉన్నాయి. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ఎన్నికల కార్యాచరణను రూపొందించుకుంటున్నారు. సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే.. ప్రత్యర్థి పార్టీలకు చెందిన నాయకులను, కీలక కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవడం ద్వారా ఎన్నికల్లో విజయతీరాలకు చేరవచ్చని గులాబీ పార్టీ భావిస్తోంది.

హరీశ్ ప్రత్యేక దృష్టి

మెదక్ లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా అభ్యర్థుల గెలుపును తన భుజాలపై వేసుకున్న ఆయన.. ఈ ఎంపీ స్థానాన్ని కూడా దక్కించుకోవాలని చూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానం మినహా మిగిలిన ఆరు స్థానాల్లో గులాబీ పార్టీ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కూడా ఇదే స్థాయిలో ఫలితాలను పునరావృతం చేయాలని వ్యూహాలు రచిస్తున్నారు.

ఎమ్మెల్యేలను కలుస్తున్న అభ్యర్థి..

బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం దక్కిన పి.వెంకట్రామిరెడ్డి నియోజకవర్గంలో తన పని ప్రారంభించారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలను కలిసి కార్యాచరణపై చర్చిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతప్రభాకర్‌ను కలిసి సమాలోచనలు జరిపారు. తర్వాత మెదక్ వెళ్లి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది. మొత్తంగా అభ్యర్థిత్వం ఖరారైన వెంటనే గులాబీ పార్టీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.

కేసీఆర్ బహిరంగ సభలు

మెదక్ లోక్‌సభ పరిధిలో కనీసం రెండు చోట్ల మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభలు నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. సిద్దిపేట జిల్లాలో ఒకటి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో ఉన్న నాలుగు అసెంబ్లీ స్థానాల్లో మరొకటి ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు బహిరంగ సభలను ఎక్కడ నిర్వహించాలనే దానిపై అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో చర్చిస్తున్నారు.

ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కారం

కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా డయల్ 1950, సీ–విజిల్ యాప్ ద్వారా చేసిన ఫిర్యాదులను 100 నిమిషాల్లోనే పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన రోజువారీ జిల్లా సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అందించేందుకు గాను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్, సీ–విజిల్, 1950 జిల్లా కాంటాక్ట్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన వివరాలను పత్రికలకు, మీడియాకు అందించాలన్నారు. వివిధ పత్రికల్లో చానల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌లను పరిశీలించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పొలిటికల్ అంశాలను ప్రత్యేకంగా పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డిప్యూటీ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీపీఆర్‌ఓ రవికుమార్, ఐఅండ్ పీఆర్ డీఈ తిరుపతినాయక్, కలెక్టరేట్ ఏఓ రహమాన్, ఎన్నికల సూపరింటెండెంట్ మధుసూదన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మీడియా సెంటర్‌లో కలెక్టర్ మను చౌదరి

ఉద్యమకారులకు ఇచ్చే గౌరవం ఇదేనా?

బీఆర్‌ఎస్‌ను నిలదీసిన బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్‌రావు

సాక్షి, సిద్దిపేట/ మర్కూక్(గజ్వేల్): తెలంగాణ ఉద్యమం నుంచి కేసీఆర్ వెంట నడిచిన ఉద్యమకారులకు కాకుండా అరువు, అద్దె తెచ్చుకుని, డబ్బులకు ఆశపడి బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ సీట్లు అమ్ముకుంటున్నారని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ కారులకు కేసీఆర్ ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. శనివారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో, అలాగే మర్కూక్ మండల కేంద్రంలో బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఆరుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్నా.. కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యక్తికి టికెట్ ఎందుకు అమ్ముకున్నాడో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి పని చేసిన సమయంలో వేలాది మంది రైతుల భూములు లాక్కొని నిర్వాసితులను అరగోస పెట్టారన్నారు. సిద్దిపేటకు ఎన్నికల ప్రచారానికి ఎలా వస్తారో చూస్తామని హెచ్చరించారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్, రంగనాయకసాగర్ భూ నిర్వాసితుల వేల ఎకరాల భూములు లాక్కొని ఊర్లకు ఊర్లను వెళ్లగొట్టిన వెంకట్రామిరెడ్డికి బీఆర్‌ఎస్ మెదక్ సీటు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మెదక్‌కు ఆయనకు ఎలాంటి సంబంధం ఉందో కేసీఆర్ చెప్పాలన్నారు.



మర్కూక్: మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కబ్జాల చరిత్ర నర్సారెడ్డిదే

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: తన చరిత్ర మరిచిపోయి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని, తానంటే వెన్నులో వణుకు పుట్టడం వల్లే ఇలా దుష్ప్రచారానికి ఒడిగట్టారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో నల్లాల బావితోపాటు పలు విలువైన భూము లు, ఆస్తులు.. కబ్జా చేయడంలో తూంకుంట ప్రత్యక్ష పాత్ర ఉన్నదని ఆరోపించారు. 2009 ఎన్నికల్లో తనను ఓడించడానికి పీఆర్‌పీ అభ్యర్థి ఎలక్షన్ రెడ్డికి డబ్బులు ఇచ్చారని విమర్శించారు. 2014లో పోటీ చేసి బీఆర్‌ఎస్‌కు లొంగిపోయాడని ఆరోపించారు. 2018లో కేసీఆర్‌కు ద్రోహం చేసి తన పంచన చేరాడని మండిపడ్డారు. ఆ తర్వాత నాలుగున్నరేళ్లు నియోజకవర్గంలో కార్యకర్తలను పట్టించుకోలేదన్నారు. ఇవాళ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో వివిధ వర్గాల వద్ద భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డిలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. తాను ఎంపీగా బరిలో ఉంటే గెలవనంటూ ఎమ్మెల్సీ తప్పుడు ప్రచారం చేశారన్నారు. అయితే ఎలక్షన్‌రెడ్డి పార్టీ మారతానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి గెలుపునకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

పారదర్శకంగా విధులు

అధికారులకు ఐజీ రంగనాథ్ ఆదేశం

సిద్దిపేటకమాన్: వచ్చే లోక్‌సభ ఎన్నికలను అధికారులు, సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీ) మల్టీ జోన్–1 ఏవీ రంగనాథ్ అన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌ను సందర్శించారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీపీ అనురాధ, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా భౌగోళిక పరిస్థితి, అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ నియోజకవర్గ పరిధి, పోలింగ్ లొకేషన్లు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, డివిజన్లు, సర్కిల్ కార్యాలయాలు, ఎన్నికల సందర్భంగా సెక్యూరిటీ ప్లాన్ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలన్నారు. తరచుగా గ్రామాలను సందర్శించి ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ వేసి పెండింగ్ లేకుండా చేసిన అధికారులను అభినందించారు. గంజాయి పట్టుకున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్‌ను సీపీ అనురాధ, రంగనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. గంజాయిపై డెక్ ఆపరేషన్ చేసి హైదరాబాద్ పోలీసులకు పెద్ద ఎత్తున గంజాయి పట్టించిన గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్‌ఐ శివకుమార్, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బందిని అభినందించి నగదు రివార్డు అందజేశారు. అంతకు ముందు ఏవీ రంగనాథ్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆపై సీపీ అనురాధ పూల మొక్కను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, అడిషనల్ డీసీపీలు రాంచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, సతీష్, పురుషోత్తం రెడ్డి, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, సీఐలు విద్యాసాగర్, లక్ష్మీబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంగనాథ్, పక్కన సీపీ అనురాధ



శకుంతల తయారు చేసిన కళాకృతులు









బొమ్మరిల్లు

- చెక్కలతో అందమైన బొమ్మల తయారీ
- శకుంతల చేతిలో జీవం పోసుకుంటున్న కళాకృతులు
- ఉపాధి పొందుతూ.. పలువురికి శిక్షణ

ఆమె చేతిలో కర్ర కూడా అద్భుతమైన బొమ్మగా జీవం పోసుకుంటుంది. తన కళా నైపుణ్యంతో ఔరా.. అనిపించే కళాకృతులు తయారు చేస్తూ అబ్బురపరుస్తోంది. జహీరాబాద్‌కు చెందిన శకుంతల బొమ్మలు తయారు చేయడంలో దిట్ట. వాటిని చూసిన జనం మంత్రముగ్ధులవుతారు. ఇవి ఆమె చేతితో చేసినవేనా..? అనే అనుమానం కలగక మానదు. అంతటి కళాఖండాలను తయారు చేస్తూ తాను ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి శిక్షణ ఇస్తున్న శకుంతల.. పలువురి మన్ననలు పొందుతున్నారు.

- యెర్బల్ శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్

జహీరాబాద్ పట్టణానికి చెందిన పసారి శకుంతల అందమైన కళాకృతులను తయారు చేయడంలో అందెవేసిన చెయ్యి. గంధం చెక్కలు, తెల్ల కలపే ప్రధాన ముడి సరుకు. ఆమె చేతిలో వినాయకుడు, శివుడు, వెంకటేశ్వరుడు, బుద్ధుడు, క్రీస్తు తదితర ఆరాధ్య రూపాలు ప్రాణం పోసుకుంటాయి. అంతే కాకుండా అలంకారానికి ఉపయోగపడే పూలకుండీలు, ఏనుగులతో పాటు పలు రకాల షీల్డ్‌లు, కీ చైన్లు, కుంకుమ భరణి, పెన్ స్టాండ్ ఇలా అనేక కళాకృతులను తయారు చేస్తోంది. గంధం చెక్కల నుంచి వృథాగా వచ్చే చెక్క పొట్టును అగర్‌బత్తీల తయారీకి ఉపయోగించుకుంటుంది.

వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని

కర్ణాటకలోని బీదర్ జిల్లా బక్షోడి గ్రామానికి చెందిన వీరమ్మ, వైజ్యనాథ్ దంపతుల కుమార్తె శకుంతల. ఆమె తల్లిదండ్రులు హస్తకళలో ప్రసిద్ధులు. దీంతో శకుంతల సైతం ఆ రంగంపై మక్కువ పెంచుకున్నారు. 10వ తరగతి చదువుకునే సమయంలోనే తల్లిదండ్రులతో కలిసి కర్రలపై బొమ్మలు చెక్కడం నేర్చుకుంది. బొమ్మల తయారీలో కుమార్తె ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు హస్తకళలో రెండేళ్ల పాటు శిక్షణ ఇప్పించారు. అనంతరం జహీరాబాద్ పట్టణానికి చెందిన నాగిశెట్టితో వివాహం చేశారు. అయినా శకుంతల చెక్కబొమ్మల తయారీని విస్మరించలేదు. 25 ఏళ్లుగా ఇదే వృత్తిని కొనసాగిస్తూ వస్తోంది. క్రమంగా కళాకృతులకు ఆదరణ లభిస్తుండడంతో భర్త నాగిశెట్టి, కుమారుడు, కుమార్తెలతో కలిసి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

నగరాల్లో విక్రయం

శకుంతల తయారు చేసిన చెక్క బొమ్మలను హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణం, బీదర్, బెంగుళూరు ఢిల్లీ తదితర ప్రాంతాల్లో జరిగే ఎగ్జిబిషన్లలో స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయిస్తుంటారు. ప్రతి ఏటా కళాకృతుల అమ్మకం ద్వారా సుమారు రూ.3.50 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు వివరించారు. ఇదే తన కుటుంబానికి జీవనాధారంగా మారిందన్నారు. ఫోన్ ద్వారా ఆర్డర్లు తీసుకుని పార్శిల్ ద్వారా పంపుతున్నట్లు తెలిపింది. అధికంగా ఆర్డర్లు ఉన్నప్పుడు తాను ఈ కళను నేర్పించిన వారికి పని అప్పగిస్తానని, వారు రఫ్‌గా తయారు చేసి ఇస్తే వాటికి తాను తుది రూపం దిద్దడం జరుగుతుందన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఇప్పటి వరకు వేయి మందికి బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. 2020లో మెప్మా తరఫున సౌత్ అమెరికాలోని పెరులో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో తన కళాకృతులను ప్రదర్శించినట్లు వివరించారు. ఆ సమయంలో కరోనా విజృంభించడంతో ఐదు రోజులకే తిరిగి స్వదేశానికి వచ్చినట్లు చెప్పారు.

హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్ ఎగ్జిబిషన్‌లో..

ఇటీవల హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో గ్రౌండ్‌లో మహిళా శక్తి కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా నుంచి మెప్మా తరఫున వెళ్లి స్టాల్‌ను ఏర్పాటు చేసి శకుంతల తయారు చేసిన కళాకృతులను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో రూ.లక్ష మేరకు ఆదాయం పొందినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఆమె చెక్కిన బొమ్మలకు మంత్రముగ్దులై అభినందించారు. ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం అందిస్తామని భరోసా ఇచ్చారు. శకుంతల కళాకృతులకు పలు అవార్డులు సైతం దక్కాయి.



కళాకృతులను పరిశీలిస్తున్న సీఎం రేవంత్

ప్రభుత్వం ప్రోత్సహించాలి

కళాకృతుల తయారీకి ప్రభుత్వం ప్రోత్సహించాలి. అప్పుడే కళను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. బొమ్మల తయారీకి అవసరమైన తెల్ల కలపను కర్ణాటకలోని బెంగుళూరు, శివమొగ్గ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుంటున్నాం. అక్కడి ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తోంది. తెల్ల కలపను 50 శాతం సబ్సిడీపై అందిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా సబ్సిడీని అందించాలి. జీఎస్టీని కూడా మినహాయించాలి. ఉత్పత్తులను అమ్మకం చేసుకునేందుకు అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌కు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించాలి. అంతే కాకుండా శిల్పారామంలో పర్మినెంట్‌గా దుకాణం కేటాయించాలి.

- పసారి శకుంతల

మద్యం పట్టివేత

వెల్దుర్తి(తూప్రాన్) : ఎన్నికల కోడ్ దృష్ట్యా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు చేశారు. మండలంలోని శెట్టిపల్లిలో ఒకటి, మానెపల్లిలో రెండు బెల్ట్ షాపులపై మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి అక్రమ మద్యం పట్టుకున్నారు. కిరాణ దుకాణాల్లో అనుమతులు లేకుండా అధిక ధరలకు మద్యం అమ్ముతున్న విక్రయదారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవతగౌడ్ తెలిపారు.

ఒక్క రోజే రూ.63.76 లక్షలు సీజ్

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సరిహద్దుల్లో వాహనాల తనిఖీ ముమ్మరంగా కొనసాగుతోంది. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తున్న వాహనాలను ఆపి నగదు సీజ్ చేశారు. శనివారం ఒక్క రోజే రూ.63.76 లక్షలను అధికారులు పట్టుకున్నారు.

రూ.3 లక్షల నగదు పట్టివేత

జహీరాబాద్ టౌన్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర సరిహద్దులో గల మొగుడంపల్లి మండలం మాడ్గి చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలు తనఖీలు నిర్వహిస్తుండగా రూ.3 లక్షల నగదు పట్టుబడింది. తెలంగాణ, కర్నాటక రాష్ట్ర సరిహద్దులో జాతీయ రహదారిపై చెక్ పోస్టు ఏర్పాటు చేసి పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న ఓ కారును చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ బృందం తనిఖీలు చేసింది. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ. 3 లక్షల నగదును తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపని కారణంగా నగదును సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.



గజ్వేల్‌రూరల్: నగదు చూపుతున్న పోలీసులు

రూ. 50 లక్షల నగదు పట్టివేత

గజ్వేల్‌రూరల్: ఎలాంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.50 లక్షలు పట్టుబడిన ఘటన శుక్రవారం రాత్రి గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి గజ్వేల్ సీఐ సైదా, అడిషనల్ సీఐ ముత్యంరాజు, సిబ్బందితోపాటు కేంద్ర బలగాలతో కలిసి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. రాయపోల్‌కు చెందిన బచ్చు రత్నాకర్ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 50 లక్షలను తీసుకొని వెళ్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశాం. ఈ డబ్బును కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ కమిటీ ద్వారా ఐటీ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాం. బాధితుడు సరైన ధ్రువపత్రాలను అధికారులకు చూపించి నగదు తీసుకెళ్లొచ్చని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ఎవరైనా రూ.50 వేలకు మించి డబ్బులను వాహనాల్లో తీసుకొని వెళ్లొద్దన్నారు.

రూ.2.41 లక్షలు

పటాన్‌చెరు టౌన్: వాహనాలు తనిఖీలు చేస్తున్న అమీన్‌పూర్ పోలీసులు నగదును పట్టుకున్నారు. మండల పరిధిలోని ఐలాపూర్ చౌరస్తాలో శనివారం సాయంత్రం అమీన్‌పూర్ పోలీసులు వాహన తనిఖీ నిర్వహించగా, కూకట్‌పల్లికి చెందిన వ్యాపారి హరిత దేవి కారులో రూ.2.41 లక్షల నగదు ను గుర్తించారు. పట్టుబడిన నగదును సీజ్ చేశారు.

రూ.8.35 లక్షల నగదు..

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని శెల్గిరా వద్ద వాహనాలను తనిఖీ చేపడుతున్న సమయలోఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్తున్న నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ అమ్రనాయక్ శనివారం తెలిపారు. ఓ వాహనంలో రూ.1.80 లక్షలు, మరో వాహనంలో రూ.1.50 లక్షలు, ఇంకో వాహనంలో రూ.4.05 లక్షలు, బైక్‌పై రూ.లక్ష నగదును తరలిస్తుండగా తనిఖీలో పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.8.35 లక్షల నగదును సీజ్ చేసి డబ్బులను ఎన్నికల అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఎక్కువ డబ్బు తీసుకెళ్తే వాటికి సంబంధించిన ధ్రువ పత్రాలను చూయించాల్సి ఉంటుందన్నారు.

అవార్డులు స్ఫూర్తిని నింపుతాయి

మెదక్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత



మాట్లాడుతున్న ప్రభులత

సిద్దిపేటకమాన్: అవార్డులు స్ఫూర్తిని నింపుతాయని, అంకిత భావంతో సిబ్బంది విధులు నిర్వహించాలని ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. సిద్దిపేట, దుబ్బాక డిపోల పరిధిలో ఫిబ్రవరి నెలలో ఉత్తమ సేవలందించిన 46 మంది ఉద్యోగులకు సిద్దిపేట ఆర్టీసీ డిపోలో శనివారం ప్రగతి చక్రం అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభులత మాట్లాడుతూ.. సిబ్బంది నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పని ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించాలన్నారు. వేసవి సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, అసిస్టెంట్ ఇంజినీర్ రంజిత్‌కుమార్, దుబ్బాక డిపో ఇన్‌చార్జి కనకలక్ష్మీ, సూపర్‌వైజర్లు మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

రుక్మాపూర్‌లో బెల్లం లారీ పట్టివేత

- నాటు సారా తయారీకి తరలిస్తున్న వైనం
- సుమారు రూ.10 లక్షల విలువ



పట్టుబడ్డ లారీ, నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

నారాయణఖేడ్: అక్రమంగా బెల్లంను తరలిస్తున్న లారీని ఎక్సైజ్ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. ఖేడ్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని న్యాల్కల్ మండలం రుక్మాపూర్ తండాలో శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి 10 లీటర్ల నాటుసారా, 10 లీటర్ల బెల్లం పానకం, 20 కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని నిందితుడైన చౌహాన్ చందర్‌ను అరెస్టు చేశారు. ఇతడిని విచారించగా బెల్లం ఎక్కడి నుంచి సరఫరా అవుతుందో వివరించాడు. ఈ సమాచారంతో శనివారం ఖేడ్ మండలం జూజాల్ పూర్ శివారులోని హెచ్‌ఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో నిలిపి ఉంచిన బెల్లం లారీని పట్టుకున్నారు. లారీలో రూ.10 లక్షల విలువ గల 12,350 కిలోల బెల్లం ఉంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ ప్రాంతం నుంచి కరీంనగర్‌కు చెందిన గంధం శెట్టి రమేశ్‌కు అప్పగించడానికి బెల్లం లోడు తీసుకువెళుతున్నట్లు లారీ డ్రైవర్ బీరప్ప అంగీకరించాడు. ఇతడిపై ఇప్పటికే పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. లారీని సీజ్ చేసి చౌహాన్ చందర్, బీరప్పలను అరెస్టు చేసినట్లు వివరించారు. గంధం శెట్టి రమేశ్‌పైన కేసు నమోదు చేశామని వివరించారు.

దొంగ దొరికింది

- బస్సుల్లో నగదు చోరీ చేస్తున్న మహిళ
- అరెస్ట్ చేసిన పోలీసులు
- 10 తులాల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

(మెదక్): బస్సుల్లో బంగారం చోరీ చేస్తూ తప్పించుకు తిరుగుతున్న మహిళను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఆమె వద్ద బంగారు ఆభరణాలు స్వాధీన పర్చుకొని అరెస్ట్ చేశారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి శనివారం పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన గంగోడి గౌతమి నిజామాబాద్ వెళ్లడానికి ఈనెల 13వ తేదీన రామాయంపేట బస్టాండులో బస్సు ఎక్కింది. బస్సు జాతీయ రహదారిపైకి వెళ్లిన అనంతరం గౌతమి బ్యాగులో దాచిన పది తులాల బంగారు ఆభరణాలు చూసుకోగా కనిపించ లేదు. వెంటనే రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు విచారణలో భాగంగా రామాయంపేట సీఐ వెంకటేశ్, ఎస్‌ఐ రంజిత్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ మహిళ కంగారుగా హైదరాబాద్ వెళ్తున్న బస్సు దిగి రామాయంపేట వైపు నడుచుకుంటూ వెళ్తుంది. అనుమానించిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. తన పేరు ఠాగూర్ శారద అని, హైదరాబాద్‌లోని బొల్లారంలో నివసిస్తామని చెప్పింది. పోలీసులు మరింత లోతుగా ఆరా తీయగా, తాను బస్టాండ్లలో చోరీలు చేస్తానని అంగీకరించింది. రామాయంపేట బస్టాండులో ఈనెల 13న చోరీకి పాల్పడింది తానేనని ఒప్పుకుంది. పోలీసులు ఆమె బ్యాగ్ తెరిచి చూడగా బంగారు ఆభరణాలు దొరికాయి. ఆ నగలు గౌతమివిగా నిర్ధారించుకున్న పోలీసులు వాటిని స్వాధీనపర్చుకొని శారదను అరెస్ట్ చేశారు.

అక్రమంగా మట్టి, ఇసుక తరలింపు

ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం మెల్లూర్ పంచాయతీ పరిధి పెద్దాపూర్ శివారు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండగా 10 ట్రాక్టర్లు, ఒక జేసీబీ సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నవతగౌడ్ తెలిపారు. సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీసులు పట్టుకున్న లారీ

ఇసుక లారీ స్వాధీనం

కొమురవెల్లి(సిద్దిపేట): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక లారీని కొమురవెల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. గౌరయపల్లి శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా సిద్దిపేటకు చెందిన బోదాస్ నవీన్ లారీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నాడు. వెంటనే పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి



అమిత్ కుమార్ సింగ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్) : రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమిత్ కుమార్ సింగ్(32) మండల పరిధి దొంతిలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గ్రామ శివారులో ఉన్న మహీ గ్రానైట్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి పరిశ్రమలో విధులు ముగించుకొని తూప్రాన్-నర్సాపూర్ హైవే పై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో చండీ గ్రామానికి చెందిన ప్రవీణ్‌గుప్తా తూప్రాన్ నుంచి గ్రామానికి బైక్ పై వస్తూ అమిత్ కుమార్ సింగ్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అమిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రవీణ్‌గుప్తాకు స్వల్ప గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి షేక్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

- సిద్దిపేటలో ముగ్గురు, ములుగులో ఇద్దరు
- 4.46 కిలోలు స్వాధీనం



సిద్దిపేటఅర్బన్: వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేటఅర్బన్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. శనివారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విద్యాసాగర్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ముగ్గురు వ్యక్తులు సిర్సినగండ్ల నుంచి రెండు బైకులపై గంజాయి ప్యాకెట్లను సిద్దిపేటకు తీసుకొస్తున్నారు. నమ్మదగిన సమాచారంతో త్రీటౌన్ ఎస్సై విజయభాస్కర్ సిబ్బందితో కలిసి పొన్నాల గ్రామ శివారులో బట్టిరామన్నపల్లి స్టేజీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మర్పడ్గ నుంచి రెండు బైక్‌లపై ముగ్గురు వ్యక్తులు రాగా పట్టుకొని విచారించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ఉంది. వారి వద్ద నుంచి 4.199 కిలోలు గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన వారిలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మల్లబోయినిపల్లి గ్రామానికి చెందిన సుక్కసారి భానుప్రసాద్ ప్రస్తుత నివాసం కొండపాక మండలం సిర్సినగండ్ల, గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బోయిని నరేశ్, ఆర్కల శేఖర్ ఉన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.1,06,250 ఉంటుందన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ విద్యాసాగర్, ఎస్సై విజయభాస్కర్, సిబ్బంది అఫ్జల్, శ్రీనివాస్, నరేశ్, స్వామి, కరుణాకర్, వినోద్‌కుమార్, వెంకటేశ్, తిరుపతిలను ఏసీపీ అభినందించారు.

గంజాయి విక్రయిస్తూ..

ములుగు(గజ్వేల్) : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ములుగు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్‌ఐ విజయ్‌కుమార్‌తో కలిసి గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మండల కేంద్రమైన ములుగులోని మధువన్ వెంచర్‌లో కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్‌ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం వెంచర్‌లోకి వెళ్లారు. అక్కడ ఉన్న ఇద్దరిని తనిఖీ చేసి వారి స్కూటీలో గంజాయిని గుర్తించారు. నిందితులు వర్గల్‌కు చెందిన తలారి భరత్‌కుమార్, మర్గడి నిఖిలేశ్వర్‌రెడ్డిలుగా గుర్తించారు. వారి వద్ద లభ్యమైన 46 గ్రాముల గంజాయితోపాటు స్కూటీని, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.